# విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి

## చెకుముకి సంబరాలు, సైన్స్ ఫెయిర్‌లు కీలకం: జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్,జనతా న్యూస్: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాల్సిన అవసరం ఎంతో ఉందని, ఇందుకు చెకుముకి సంబరాలు, సైన్స్ ఫెయిర్‌లు దోహదపడతాయని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పద్మ నగర్‌లోని పారమిత హెరిటేజ్ స్కూల్‌లో ఈనెల 26 నుంచి 28 వరకు నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి చెకుముకి సంబరాల ప్రారంభోత్సవానికి ఆమె శుక్రవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు మూఢనమ్మకాలకు దూరంగా ఉండి ప్రతి అంశాన్ని శాస్త్రీయ కోణంలో ఆలోచించాలని సూచించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ, సృజనాత్మకతను వెలికి తీయడంలో సైన్స్ ఫెయిర్‌లు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రజల్లో మూఢనమ్మకాలను చెరిపివేస్తూ శాస్త్రీయ అవగాహన కల్పిస్తున్న జన విజ్ఞాన వేదిక సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. నిత్యజీవితంలోని ప్రతి అంశం సైన్స్‌తో ముడిపడి ఉందని, విద్యార్థులు ముఖ్యంగా గణితం, సైన్స్ సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. నేర్చుకున్న అంశాలను రోజువారి జీవితంలో శాస్త్రీయ కోణంలో పరిశీలిస్తూ, తోటి విద్యార్థులతో చర్చించాలన్నారు. ఉపాధ్యాయులు థియరీతో పాటు ప్రాక్టికల్స్‌పై కూడా దృష్టి సారించాలని, అన్ని పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌లను సమర్థవంతంగా వినియోగించాలన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థులు సైన్స్ పట్ల చూపుతున్న ఉత్సాహం అభినందనీయమని, వారి ప్రయోగాలు, ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయని కలెక్టర్ తెలిపారు. పాఠశాలల్లో ఏర్పాటైన వివిధ క్లబ్‌లు మరింత మంది విద్యార్థులు రాణించేలా పని చేయాలని సూచించారు. తాను గతంలో సైంటిస్ట్‌గా పనిచేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు.





ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు చెలిమెల రాజేశ్వర్, రాష్ట్ర కార్యదర్శి పి. మణీంద్రం, సీసీఎంబి మాజీ డైరెక్టర్ మోహన్ రావు, నిమ్స్ మాజీ డైరెక్టర్ ప్రసాదరావు, పారమిత విద్యాసంస్థల చైర్మన్ ప్రసాదరావు, నెహ్రూ యువ కేంద్ర కోఆర్డినేటర్ రాంబాబు, జిల్లా సైన్స్ అధికారి జయపాల్ రెడ్డి, విద్యాశాఖ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, జెవివి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి

## బీజేపీ సీనియర్ నాయకులు వరియోగుల అనంతస్వామి డిమాండ్



హుస్నాబాద్,జనత న్యూస్: హుస్నాబాద్ మున్సిపల్ పరిధిలో ప్రధాన రహదారులు, డ్రైనేజీలను ఆక్రమించి ఇష్టానుసారంగా వ్యాపారాలు చేస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న వ్యాపారులపై మున్సిపల్, పోలీస్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ సీనియర్ నాయకులు వరియోగుల అనంతస్వామి డిమాండ్ చేశారు. పట్టణంలోని మెయిన్ రోడ్డుతో పాటు రామవరం, నాగారం, అక్కన్నపేట రహదారుల వెంట డ్రైనేజీలను ఆక్రమించి వ్యాపారాలు చేయడం వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన మండిపడ్డారు. ముఖ్యంగా దుకాణాల ముందు ఖాళీ స్థలాలను చిరు వ్యాపారులకు వేల రూపాయలకు అద్దెకు ఇస్తూ, రోడ్లను కుదించడం వల్ల వాహనదారులకు, పాదచారులకు నరకం కనిపిస్తోందని ఆయన ఆరోపించారు. ఇప్పటికే మున్సిపల్, పోలీస్ శాఖలు రెండుసార్లు హెచ్చరికలు జారీ చేసినా, రోడ్లపై ఉన్న వస్తువులను తొలగించినా వ్యాపారుల తీరులో మార్పు రాకపోవడం వెనుక అధికారుల మెతక వైఖరే కారణమని విమర్శించారు. మున్సిపల్ కమిషనర్ గారు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి తప్ప, వ్యాపారులను బ్రతిమిలాడే ధోరణిలో ఉండటం సరికాదని ఆయన హితవు పలికారు. దుకాణాలకు పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో వినియోగదారులు తమ వాహనాలను హైవేపైనే నిలుపుతున్నారని, దీనివల్ల భారీ వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడి ట్రాఫిక్ జాం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలు అతిక్రమిస్తున్న వ్యాపార వర్గాలకు రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయా లేదా అధికారులే వారికి తలొగ్గుతున్నారా అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు చిత్తశుద్ధితో స్పందించి, ఆక్రమణలకు పాల్పడుతున్న వారి ట్రేడ్ లైసెన్సులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పట్టణ ప్రజల తరపున మున్సిపల్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని అనంతస్వామి హెచ్చరించారు.

# త్యాగాల చరిత్రకు శతాబ్ది వసంతం

## సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్



హుస్నాబాద్,జనత న్యూస్: దేశ స్వాతంత్ర్యం కోసం, అణగారిన వర్గాల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)దేనని ఆ పార్టీ సిద్దిపేట జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్ అన్నారు. సిపిఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా, గురువారం హుస్నాబాద్‌లోని అనభేరి,సింగిరెడ్డి అమరుల భవనం వద్ద ఆయన పార్టీ ఎర్రజెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లేశ్ మాట్లాడుతూ.. 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో ఆవిర్భవించిన సిపిఐ... సంపూర్ణ స్వాతంత్ర్యమే లక్ష్యంగా తీర్మానం చేసిన తొలి రాజకీయ పార్టీ అని గుర్తుచేశారు. బ్రిటిష్ పాలనపై తిరుగుబాటు చేసిన తొలితరం కమ్యూనిస్టు నేతలు కుట్ర కేసులను, జైలు శిక్షలను ఎదిరించి పోరాడారన్నారు. వీర తెలంగాణ సాయుధ పోరాటంలో 4500 మంది కమ్యూనిస్టులు ప్రాణత్యాగం చేసి, ఈ గడ్డను నిజాం కబంధహస్తాల నుంచి విముక్తి చేశారని కొనియాడారు. నియోజకవర్గ కన్వీనర్ జాగీర్ సత్యనారాయణ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యానంతరం పార్లమెంటులో ప్రధాన ప్రతిపక్షంగా సిపిఐ ఎన్నో భూసంస్కరణలు సాధించిందని తెలిపారు. ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టం వంటి విప్లవాత్మక మార్పుల్లో పార్టీది కీలక పాత్ర అని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తూ, కార్మిక చట్టాలను నీరుగారుస్తోందని ధ్వజమెత్తారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను అడ్డుకుని, చిన్న తరహా పరిశ్రమలను కాపాడే వరకు సిపిఐ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జనగాం రాజ్ కుమార్, రైతు సంఘం నాయకురాలు జంగ విజయ, పార్టీ నేతలు అయిలేని మల్లారెడ్డి, పిట్టల ప్రసాద్, మౌటం బాలయ్య, నీలం పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సీఎం వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఫైర్

## కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి: సుంకే రవిశంకర్



కరీంనగర్: చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కరీంనగర్‌లో మాజీ మంత్రి గంగుల కమలాకర్ నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి లికేసీఆర్‌లిపై సీఎం స్థాయికి తగని వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సుదీర్ఘ పోరాటం చేసిన నాయకుడిపై అవమానకరంగా మాట్లాడితే బీఆర్ఎస్ పార్టీ ఊరుకోదని హెచ్చరించారు. పాలమూరు ప్రాజెక్టు పనుల పురోగతి, రైతుబంధు చెల్లింపులు, కల్యాణలక్ష్మి అమలు, పెన్షన్ల పెంపుపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. హామీలు నెరవేర్చకుండా విమర్శల నుంచి తప్పించుకునేందుకు సీఎం అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. మహిళల పట్ల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత సీఎంపై ఉందని, రాజకీయ విమర్శలు మర్యాదగా ఉండాలని ఆయన సూచించారు. ప్రజల సమస్యలను పక్కనపెట్టి వ్యక్తిగత దూషణలకు పాల్పడితే ప్రజలు తగిన సమాధానం ఇస్తారని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దేవక్కపల్లిలో శ్రీ సమ్మక్క-సారలమ్మ జాతర ఏర్పాట్లు ప్రారంభం



బెజ్జంకి, జనతా న్యూస్: దేవక్కపల్లి గ్రామంలో జనవరి 28, 29, 30 తేదీల్లో జరగనున్న శ్రీ సమ్మక్క%-%సారలమ్మ జాతరకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. జాతరకు వచ్చే భక్తులకు తాగునీటి వసతి కల్పించేందుకు మాజి ఎంపీపీ ఒగ్గు దామోదర్, ఒంటెల సంపత్ రెడ్డి కలిసి రూ.20 వేల విలువ చేసే కొత్త బోర్ మోటార్, పైపులు, వైర్లు అందజేశారు. ఈ సందర్భంగా జాతర కమిటీ చైర్మన్ జంగిడి సంజీవ రెడ్డి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. బోర్ మోటార్ ఏర్పాట్లకు నేడు కొబ్బరికాయలు కొట్టి అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముక్కిస రత్నాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, జాతర కమిటీ పూజారులు, గ్రామస్తులు పాల్గొన్నారు. జాతర నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు దశలవారీగా చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# వీర్ బాల్ దివస్ ఘనంగా నిర్వహణ




కరీంనగర్,జనతా న్యూస్ :గురు గోవింద్ సింగ్ జీ కుమారుల వీరోచిత త్యాగాలకు నివాళిగా ప్రతి ఏటా డిసెంబర్ 26న నిర్వహించే వీర్ బాల్ దివస్ కార్యక్రమాన్ని కరీంనగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, సాహిబ్ జాదా జోరావర్ సింగ్, ఫతే సింగ్ ల ధైర్యసాహసాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో టవర్ సర్కిల్ నుంచి సిక్కువాడి గురుద్వారా వరకు నగర కీర్తన యాత్ర నిర్వహించారు. 2022లో ప్రధాని నరేంద్ర మోదీ వీర్ బాల్ దివస్‌ను జాతీయ దినోత్సవంగా ప్రకటించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గురుద్వారా కమిటీ సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.'

